


త్రోవంతా జారూ, బురదా. వంకర టింకర గట్లు. ఎక్కడ పడతారోనని భయం. రాలకుండా శరీరాలు కాపాడుకుంటూ, సన్నని అతి సన్నని పొలంగట్ల మీదుగా చెప్పులు చేతబట్టుకుని, లోన్సాఫీసరూ ఆయన బంట్రోతూ, చూస్తూ చూస్తూ, మూడు మైళ్ళదూరం నడిచి వెళ్లారు. ముప్పదిమైళ్ళదూరం నడిచి వెళ్ళినంతగా అలసిపోయారు. తీక్షదృష్టి కారణంగా కళ్లు చెమ్మగిల్లాయి. ఊపిరితిత్తులు తత్తరపడ్డాయి. బంట్రోతు నెత్తిని బరువైన బెడ్డింగు వుంది. అందులో నాల్గుపూటలు ఎకాఎకీ మకాం చెయ్యడానికి సరిపోయే సామగ్రి...నువ్వులపొడీ, ఆవపిండితోసహా కుక్కబడ్డవి. చిన్న నూనె సీసా, అద్దం, దువ్వెనా, ఆఫీసు ఫైల్సూ, మడతరూళ్ళకాగితాలూ, వాడిగా చెక్కిన సాదా, ఎరుపు, నీలిరంగుల పెన్సిళ్లు బత్తాయి చాకూ, కేప్స్టన్ సిగరెట్ల డబ్బాలూ, సీలు తెంచని అగ్గి మందస త్రయం, కూడా వున్నాయని వేరే చెప్పాల్సిన అవసరంలేదు. చంకలో ఫ్లాస్కూ, చింకిగొడుగూ వున్నాయి. వానకీ, ఎండకీ గొడుగడ్డంకి. సంచిలో గడమానీన దుప్పటీ. అది బంట్రోతుమకాం సంచీ. వాడికే కంపు కొడుతూవుంది. తప్పనిసరి, ఎవరి కంపు వారు భరించకతీరదు. జేబులోనే, చేరుమాలుకి ఉనికి!

పలుసార్లు ఆఫీసరు కాలుజారి, మడిగట్ల మీదనుంచి క్రింద పడబోయాడు. తూగినప్పుడల్లా బంట్రోతు భుజం అడ్డుపడేది. ఊత పుచ్చుకుని అడుసులో పడకుండా ఆత్మరక్షణ చేసుకునేవాడు. పడితే చెప్పాలి? మడతచేసిన బట్టలు మార్చుకోవాలి. లేకపోతే గ్రామంలోని పిన్నలూ, పెద్దలూ స్వల్పంగా అంచనా వేస్తారు. బంట్రోతు: అబ్బో! చాకచక్యమైన దేహి. గట్లన్నీ చిరపరిచితమవటాన అంత తేలిగ్గా కాలడు, కాలినా, కిచకిచ లేపీ అతనిమీద పనిచెయ్యవు. తీగమీద నాట్యం చేసినప్పటి మెలకువతో, పొలాలగట్లు బెడ్డింగు మోస్తూనే, ఇట్టే దాటేశాడు.

చేలు నిలువెత్తు పెరిగున్నాయి. కొంత గాలికి సైనిక నివహంలా, వంగి లేస్తున్నాయి. కప్పల బెక బెకలు, అక్కడక్కడ ఒక్కొక్క ఎండ్రిక కులుకుతూ, పోతూ అడుగుల సవ్వడి విని, అమాంతం గలగల పారే తూము నీటిప్రవాహంలో కురికి, అంతర్ధి నవధరిస్తోవుంది. నీలాకాశంలో నుండి తెల్లటి కొంగలబారు నేలకి వాల్తూ వుండగా చూసి, ఆ మనోహరదృశ్యానికి ముగ్ధుడై ఆఫీసరు ఛాయాగ్రాహికతో ఒక షాట్ తీశాడు. మాంచి పసందైన షాట్. ఏ పత్రికలో ప్రచురించినా, ప్రత్యేక బహుమతి సందుకోవచ్చు. ఇట్టివే మరి కొన్ని సంపాదించాలి. జనపదాల్లో బోలెడు. ప్రతీ అంగుళం మేరా అందాల తునక.

మెరక చేరారు. ఆఫీసరు 'ఒక మినిటు సేపు చతికిలబడి, విశ్రాంతి తీసుకునిముందుకి పోదా'మన్నాడు.

## దేశిరాట్-విరాట్

'దగ్గిరికి రానే వొచ్చాం. ఎందుకుబాబు గారూ, ఇక్కడ మనకి తిప్ప! నేలబాగో లేదు, రాళ్లూ, రప్పలూ. ముళ్లు కూడా వున్నట్టున్నాయి. గుచ్చుకుంటే చస్తాం. రాత్రి తెలుస్తుంది బాధ. కునుకు పట్టదు సుమండీ! మెల్లిగా అడుగులెయ్యండి. అవుగో, ఆ కళ్ళాలు దాటితే, అవతల తాటితోట్ల గోర్జి. తరవాత మునిసీబుగారి తోట; అమ్మోరుగుడీ, చెరువూ, ఇంకేముంది? 'కొడవలి' చేరుకున్నామన్న మాటే.' అని భరోసా చెప్పి బంట్రోతు అయ్యగారి ఎడమ రెక్కపట్టుకుని లేవనెత్తాడు. అనాలోచితంగా కూర్చోబోతున్న అయ్యగారిని నడిపించాడు.

మార్దవమైన అయ్యగారి పాదం దేనికో కసీమని గుద్దింది బొటనవ్రేలి చివరి పైపొర చిట్లి, చిల్లున నెత్తురు చిమ్మింది. బంట్రోతు జరిగిన మహాప్రమాదానికి వగచి, పాగాగుడ్డ చించి, కట్టుకట్టాడు. చేతిలోని చెప్పుల జత నందుకుని భద్రంగా అయ్యగారి పాదాలకి తొడిగాడు. 'అంతవరకూ సుష్కంగా ఎందుకు మోశానా?' అని బాధపడ్డారు అయ్యగారు. దెబ్బతో జ్ఞానోదయమైంది. స్మృతిలేక ప్రయాణం సాగిస్తే పల్లెబాటల్లో చిక్కులు జాస్తి. దొంగరాళ్లుంటాయి. ముళ్ళు ముద్దెట్టుకుంటాయి. అందుకే చెప్పులు విడవరాదంటారు. పాదరక్షలు మరి.

వేరుశెనగకాయలు ముదిరినట్టున్నాయి. పల్లెపడుచులు బృందగీతి పాడుతూ, చెట్లు తీస్తున్నారు. జానపదగీతాలు చక్కగా వుంటవి. ఆపాతమధురంగానూ వుంటవి. పాడడం అతి తేలిక. పిల్లలకే ఇట్టే వస్తాయి. అందరూ మ్యూజిక్ డైరెక్టర్సే. తికమక మట్టిస్తూ వుంటారు. శ్రావ్యమైన ఈ పాటలకి సంగీతం కూర్చివ్వ రెండు చేతో! ఇస్తే ఫిలిములెంత రసవంతంగా వుండేవి! జనాన్నెంత గుంపులు గుంపులుగా ఆకర్షించేవి! డబ్బుకి డబ్బూ, ప్రాంతీయ సంగీతానికి న్యాయమైన ప్రచారమూ. వినేవా రెవరు?

దారిచెంత ఒకచోట పొగలేస్తూ వుంది. ముగ్గురు, నలుగురు కాయలు కాల్చుకుంటున్నారు. మంటలు ఆర్పి, ఉడికిన కాయలు విరుకు తింటున్నారు. ఒలిచిన తొక్కలు పోగులు పడుతున్నాయి. చేతులనిండా మసి. గూనల్లో నీళ్ళున్నాయి. ఒకదొక్కణ్ణి మేలమాడేడు. అతడతణ్ణి వెనక్కి తోశాడు. పంచెకి మరకయ్యింది. అందరూ పకపక నవ్వుతున్నారు. బంట్రోతుకి నోరూరింది. వేరుశెనగ ఎంతవాడినైనా బిచ్చగాణ్ణి చేస్తుంది.

'కసిన్ని కాయలు పెట్టు' మని అలాభిషతో చెయ్యి చాచాడు.

'తియ్యరా-కుంచం! తినడానికొచ్చాడు బంట్రోతు!!' అన్నాడందులో ఒకడు.

ఎళ్ళవయ్యా! కుంచం కరీదు పావలా. ఎన్ని కుంచా లమ్మితే మదుపొస్తుంది? ఇత్తనాలకాయలు!' అనబోతూ వుంటే, వీరేసు నోరు ఎవరో మూసి, ఫెడేల్మని చెంప కొట్టినట్టయింది.

కళ్లెత్తి చూశాడు. ముత్యం! ఊర



ఆఫీసరుగారూ, బంట్రోతూ గతుక్కుమన్నారు......గడ్డిగంప చంకనెత్తుకుని ముత్తెం ఆదారినే వచ్చింది.

గిచ్చుక. రణదిప్పరాలుగాయగుంట. దర్జ పటాకీ. మాటలు నేర్చిన కుక్క.

'ఏమంటున్నార్రా – ఎదవల్లారా! ఇత్తినా లకాయ లివ్వగూడదంటున్నారా? కుంచం పావలా అంటారా? ఇస్తే మీ కొంపేం పోయింది? పిడికెడు కాయలే గదా పోయేవి? అమాత్తరానికి సిపాయిట్టు కుంటారా? ఎంత ఆప్పేయంగా అడిగాడో మనిసి! మనిసంత మనిసిని 'లేవు పొమ్మం టారా? పందికొక్కుల్లా మీరు బుక్కడాని కున్నాయా? ఇవ్వండి. తిన్నగా తీసివ్వండి!' అని గదమాయించింది.

'ఏటోసే – నీ దానం!'

'ఏటిరో – నీ కూడిక! మీ బాబూ, నీలాగే ఎదటోళ్ళి తెగమాసి, డబ్బుకూడిక సేశాడు. గడ్డంకింద పల్లం కొన్నాడు, తల్లి మాలచ్చి జబ్బు కట్టించింది. పొలం తరి గేసి, ఇసక మేటేసింది. సచ్చేకాలానికి కుష్టొచ్చి సచ్చాడు. నువ్వు కూడా అలాగే సవ్వగలువు. ఈలోపల పున్నెం సేసుకో. రావయ్యా! బంట్రోతూ – ఇలారా! అంది వన్ని తీసుకో. ఎళ్ళు.' అని అనుమతిచ్చింది.

'ముట్టుకు నేవు జాగర్త!!' అని బెదరించాడు వీరేసు.

'ఆత్తిరె! మళ్ళి బెదిరిస్తున్నావురా ఎదవకానా? బంట్రోతు పచ్చోడు గొబ్బటి సరిపోయింది. ఘూగుకున్నాడు. లేగుంటే అయ్యగారికి ఫురెక్కించి, అయినకాల మెట్టివిగా దాగంటే, జొన్నా పండెంటుకు ఎరుగవగం దుకు పండించావని ఎగుప్పకు తిరుగారాయింపించి, పోలీసోడిని తెప్పించు బేడీలెయిత్తే ఎక్కడుంటావో! కిక్కు బిక్కుమన కుండా జొక్కలోకెళ్ళి కూర్చోవాల. ఇంద వయ్యా! నేనిస్తా, పుచ్చుకో, పిడికాడు. ఈఛేం సేస్తాడో నేను సూస్తా.' సత్యం పిడికెడు కాయలుతీసి ధైర్యంగా బంట్రోతు చేతిలో పెట్టింది. వీరేసు కొందన లేక పోయాడు.

# ★ ఆణిముత్యం ★

ముత్యం అన్నమాటల్లో ఆఫీసరుగారికి కరువెందుకు తగ్గలేదో అప్రయత్నంగా తెలిసిపోయింది. ఫ్యాక్టరీలూ, మిల్లులూ తమ బ్రతుకుతెరువుకోసం వాణిజ్య పదార్థాల గరిష్ఠ ధరలు పెంచాయి. రుచి మరిగిన రైతురాజులు ధనార్జనాపేక్షతో, వాణిజ్యపదార్థాలే సేద్యం చెయ్యనారంభించారు. ప్రతి జానెడుజాగా, గోగునారతోనూ, వేరుశెనగతోనూ నింపారు. కడుపుకి కావలసిన తిండిగింజలు పండించటం మానుకున్నారు. పర్యవసానంగా ఆహార పదార్థాల ఉత్పత్తి క్షీణించిపోయింది. పరిస్థితి విషమించింది. ఆకలి జ్వాలల్లో తగులుకున్నారు ప్రజలు. ముఖ్యంగా తనలాంటి స్వల్పాదాయంగల మధ్యతరగతి కుటుంబీకులు, ఈ పూట తిండిలేక, పసిబిడ్డల్తో, వృద్ధుల్తో అఘోరిస్తూ ఇంటా బయటా వీరిని కపిస్తున్నవారెందరో! ఆకాశంలో చుక్కలెన్ని వుంటాయో, అంతమంది వుంటారు.

గోర్జిలో ఆఫీసరుగారూ, బంట్రోతూ గతుక్కుమన్నారు. అవతల తుప్పలో నుండి ఇవతలికేదో 'చారల జంతువు' చర్రున దుమికినట్లయి, ముందు కడుగేస్తే ఏం కీడుమూడుతుందోనన్న గుండెబితుకుతో చప్పుడు విన్నచోటనే నిలబడిపోయారు. కాళ్ళు గజగజ వణుకుతున్నాయి.

తవ్విన గడ్డిగంప చంక నెత్తుకుని ముత్తెం ఆదారినే వచ్చింది. ఇద్దర్నీ ఎగాదిగా చూసి, 'ఏటిసోద్దెం?' అని సంజ్ఞచేసి అడిగింది. బంట్రోతు 'ఛర్రున ఏదో దుమికినట్లయిం'దని తడబడుతూ చెప్పాడు.

'ఎలాగుందది?'

'నల్లటి చారలు...'

'కట్లపామనుకున్నావా?'

విరగబడి నవ్వింది.

'ఎర్రి పీనుగ! బుర్రకి బుద్ధిలేదు. ఉడత! ఉడత!! నీవేలందించినా, పిసరంత కరవదు. సావవు పద!' నిబ్బరంగా తోవదీసింది.

ముత్యాన్ని అయ్యగారు మెల్లిగా పిల్చారు.

'నీ పేరేమిటన్నావు?' అని అడిగారు.

'ముత్తెం!!' అంది ముచ్చటగా మొహం వెనక్కి తిప్పిచూసి.

'పరశురాములు ఊర్లో వున్నాడా?'

'ఎవుడా పరుసురాములు? నాయుడా! ఆడి సిగతరగ! ఆడంత టక్కుటమారీ, గజకర్న గోకర్న ఇందరజాల మయేందరజాల ఇద్దెలు తెలిసిన గాడిదకొడుకు లేడీ వూళ్ళో. ఆడేవన్నీ పచ్చి అబద్దాలు, సేసేవన్నీ సీరామదూతసేస్టలు. పిలకా పిలకా ముడేస్తాడు. తలకో పదీ గుంజేస్తాడు. పట్నంలో సానుంది బాబూ-సాని! పేకముక్క లాడతాడు. పీకమొయ్యా తాగుతాడు. ఒంటిమీద తెలివుండదు ఎదవకి. నానా కూనిరాగాలూ తీస్తాడు. కూనీ సేయించాడు కూనీ!!'

'ఆఁ. కూనీ చేయించాడా?' అన్నాడు ఆఫీసరు.

"మీరు మా నాటకం కంపెనీలో చేరి వేషాలు వేయాలనుకోవటం చాలా సంతోషించదగ్గవిషయం. కానీ—మీకు నటనలో పూర్వానుభవం ఉన్నదా? ఏపాత్ర ఎలా నటించాలో తెలుసా?"

"నాకు పూర్వానుభవం అయితే లేదు కానండీ, మీరు వేస్తూవున్న నాటకాలు చూసి చూసి, ఏపాత్ర ఎలా నటించకూడదో బాగా అర్థం చేసుకొన్నానండీ!".

'ఆడు సాన్నుంచుకుంటే, ఆడి పెళ్ళాం గంగారత్నం కళ్ళంలో పాలేరు నుంచుకుంది. కూడు పట్టుకెళ్ళినప్పుడల్లా కుప్పలిరుకున సరసాలు. గుంటడు మా బాగుండేవోడులెండి. పిటపిట లాడుతూండేవోడు. గట్టిగా మేపేది, కులికించేవోడు కదండీ! ఎలాగ కంపుకొట్టిందో-నాయుడికి. సెట్టెక్కించి, తిరగదోసి, కాలుజారి పడి సచ్చాడని పుకారు పుట్టించాడు. నేను సూత్తూనేవున్నా దూరంనించి. గుట్టెక్కడ సెబుతానో అని నాయుడి బయం. సెప్పవల్లొచ్చినప్పుడు సెబతాను. పరువుదీసి పందిరేయిస్తాను. మెడకి తాడు తగిలింపిస్తాను. నన్నుకూడా సంపాలనుకుంటున్నాడు. నేనంత సులువుగా దొరకను. నాకాడ సురుకైన బోరిగుంది. పిటికెలో నాయుడు టపా.' బోరిగత్తి చూపించింది. తళతళ మెరిసింది బోరిగె.

'నాయుడు—ఇంట్లో వున్నాడా?'

'వుంటాడు. వుండకేం జేస్తాడు? పట్నంనుంచి పొద్దున్నే తిరిగొచ్చాడు! నాటకం నూశాడంట—నాటకం! పది రూపాయిలిచ్చి కొన్నాడంట పిక్కట్టు! ఆడి డబ్బు కాకపోతే ఎంతిచ్చి అయినా కొంటాడు. మీలాటివోరు కొనలేరు. పొట్టసించితే అచ్చరంరాని మొద్దులు. 'కా' కెన్ని వంకలున్నాయో తెలవని కుక్కలు. ఒట్టి నిశానీదార్లు. దేముడిచ్చిన బూమి దున్నుకోక, ఊళ్ళకెందుకు సెప్పండీ—

GOVERNMENT OF MADRAS
మద్రాసు సర్కారు ఉత్పత్తి
సత్యమేవ జయతే

కేరళ
షేవింగ్‌స్టిక్
(పరిశుద్ధమైన తైలమునుండి తయారైనది)
స్టిక్కులు-గిన్నెసబ్బులు

తేలికైన మెత్తని క్షౌరమునకు

కేరళసోప్ ఇన్‌స్టిట్యూట్ కోజికోడ్, డిపార్టుమెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్ & కామర్సు మద్రాసు, వారి ఒక డివిజను.

Sistas K S 30.

కుష్ఠు ★ బొల్లి

సెగ్గైరా మేహామచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

నాటకాలూ, బయస్కోపులూ. తెలవాలా? ఏడవాలా? తమర్నే ఆపీసరంటారండి?'

'లేస్సు'

'అంటే డాన్సా?'

'కాదు; అప్పు లివ్వడం, వసూలు చెయ్యడం.'

'ఓహో, అలాగా! కిందటేడు మీరే గదండి, గ్రామాని కప్పిచ్చారు? ఆ సొమ్మంతా నాయుడేటి సేశాడో తెలుసా? సిట్టాలో కర్చు రాసి సగం నార మీద పెట్టాడు. సైకిలొకటి కొన్నాడు, సగం సెంబర్లకప్పిచ్చాడు. అందులో నలుగురు ఎప్పుడో సచ్చినోళ్లు, ఇద్దరు అసలే పుట్టనోళ్లు. తల్లి పేరలో నుందండి నాయుడికి! మిగిలినోళ్ళకి తన పేర నోట్లు రాయించుకుని రొచ్చువడ్డీ కప్పులిచ్చాడు. ఇంకా ఏటి సేశాడని అడగరు! అడిగితే గుట్టుమట్టంతా సెప్పేస్తా. ఎయ్యి రూపాయిలు ఈలోగా వొసూలుసేసి ఎల్లెక్కడో కొని తెచ్చుకున్నాడు. ఇందుకేనా, అప్పిచ్చారు గ్రామానికి! అడగండి. నిలవదీసి అడగండి. ఏటంటాడో తెలుద్ది. సెంబర్లివ్వలేదంటాడు దగాకోరు. గుండు పగల్దీసి తంతే తప్పుందీ? అణా పైసల్తో కక్కుమనండి. అణ్ణిమాత్తరం ఎప్పుడూ నమ్మకండి. నామాటినండి. డేంజరు, డేంజరు!'

'ఏటి గుంటా! అయ్యగారికి మంతరిస్తున్నావు. ఎవుడి మీ దేటి- నీకోల దెబ్బ?' అంటూ తోట్లోంచి పరశురాములు నాయుడు ముగ్గుర్నీ కలుసుకుని ముత్యాన్ని పరాశకమాడాడు.

'ఎవుడినో కొడితే నాకేం గొప్ప! కొడితే, నిన్నే కొట్టాల. నీ మీద్రసా రాముడు మామా! పొద్దు గూకింది. నీకేం? నీలుగుతూ వొస్తావు. నాకింకా పూళ్ళో పనుంది. సింతపిక్కా, మిరపకాయా కొనాల. మావోడు నాకోసం గుల్లెక్క పెట్టి సూస్తుంటడు' అని ఆగకుండా గబగబా నడిచి వెళ్ళిపోయింది.

'దాని టెక్కు సూడండయ్యగోరూ! ఎలా మాటకి మాట జెబా బిస్తున్నదో. సెమ్మకాతరు లేదు గుంటకి. సిటాపటా పేల్తుంటది. ఉన్నవీ, లేనివీ కల్లబొల్లి కతలల్లి సెప్పడంలో మా గటికురాలు సుమండీ! తప్పక నమ్మేయాల, పీకలు తెగే యన్నమాటే. పుల్లలా వుందా, నల్లకాకి! నిలువు నిలువునా ఇసం, ఇసం!!'

పరశురాములు నాయుడు ముత్యం చహారా అంతా ఆఫీసరుగారికి ముక్తసరిగా మూడు మాటల్లో చెప్పాడు.

సంగిడీగాడి ముద్దుపెళ్లాం ముత్యం. కరణంగారి కూతురి మెడలోని గొలుసు దొంగిలించినందుకుగాను ఏడేళ్ళ కిందట పోలీసు వాళ్లు సంగిడీగాడిని అరెస్టు చేసి, రాజమండ్రి సెంట్రలు జయిలుకి బంగీకట్టారు. సంవత్సరం కఠినశిక్ష పూర్తి కాగానే, చౌర్యగుణం చచ్చిపోయిందని భ్రమసి, సంగిడీగాడిని జైలునుండి విడుదలచేశారు. అక్కడినుండి తన్నుకొచ్చాడుముత్యాన్ని. ముత్యం అప్పటికి మూడుచేతులు మారింది. ఇది నాలుగోచెయ్యి. ఈ వూళ్ళో కాలు పెట్టింది. పెట్టిన నెలరోజులు దాటకుండా బలాత్కరించాడని రిపోర్టుచేసి, పాపం! 'కేజూవు గాడిని' జయిలు కంపించింది. సరుకు బ్లాక్‌మార్కెట్టు చేస్తున్నాడని తాసీల్దారు చెవిలోవూది, కన్నయ్యశెట్టి లైసెన్సు రద్దుచేయించింది. కన్నయ్యశెట్టి రోజూ అలో, పాలో మంటుంటాడు. ఎప్పుడోగాని కూలికెళ్ళదు. దాని మొగుడు సంగిడీగాడున్నాడే, వాడే తెచ్చిపోస్తుంటాడు. వాడికి చేకొక్క, బక్క సున్న. వాడి అర్ధనావద్ద తే తమాషా అయింది. ఈ ముతాలోకల్లా పేరుమోసిన



S. 202-50 TL

# ★ ఆణి ముత్యం ★

గజదొంగ. కన్నెదంటే గిరికీకొట్టి, ఆవులూ, గేదెలూ, దూడలూ, మేకలూ మొదలైనవి అపహరించుకునిపోయి, మరుచటి సంతలో మళ్లీ ఆ యజమానులికే, ఖరీదుకి చెలామణీ చేసి, డబ్బుచేసుకుంటాడు. ఇంటికి వచ్చిందాకా పోల్చుకోలేరు మూర్ఖులు. వరీ, జొన్నా వంటివి ఇంట్లో సేప చేస్తాడు. వాడికి కోళ్ళంటే మహాప్రీతి, కోడిమాంసం లేందీ, ఏపూటా కూడు సయించదు. అందరి ఇళ్ళముందూ కుండ పెంకులూ, చింకిపాతలూ, పోగులుపడుంటే, సంగిడిగాడి గుడిసెచుట్టూ కోడి వండ్రుకలే. అవి అందరికోళ్ళ వెండ్రుకలూను. ఆ వెండ్రుకలరాసుల్లో తప్పిపోయిన ఎవరికోడి వెండ్రుకలైనా దొరకగలవు. దొరికినా, ఎవడూ ధైర్యంచేసి 'ఇదేమిట్రా?' అని సంగిడీగాడిని నిలవదీసి అడగలేడు. అడిగితే తంతాడని హడల్. సంగిడీగాడు దున్నపోతు. అంతంతలేసి దండలు, పెలికెలు తిరిగుంటాయి. ఢీకొంటే పదిమందిని కలిపి, పచ్చడి చేస్తాడు. ఆ ఆసరా చూసుకునే ముత్యం తైతక్కలాడుతూవున్నది.

పరశురాములు నాయుడి పెంకుటింట్లో రాత్రి ఆఫీసరుగారికి వెచ్చని బస దొరికింది. ప్రక్క కొట్లలో ఎలకల గడబిడ. యత్రధూమ స్తత్ర వహ్నిః. ఏమీ లేనిచోట ఎలకలుండవు, గడబిడ చేయ నేరవు. కొట్లో బహుశా ధాన్యం వుండి తీరాలి. ఇచ్చిన పావుశేరుబియ్యం వుడికించుకున్నారు. పరశురాములు పంపిన పాలు పోసుకుని భుక్తి ముగించారు. పట్నంలో తనవారికి పూట పస్తు. రేషనింగు రద్దు చేసినా, బియ్యం ధర ఎందుకో మేఘాల మీద నడుస్తూవుంది. నిన్నటివరకూ రోజుకి నాలుగురూపాయిల చొప్పున బియ్యం కొన్నారు. ఆ మీద కొంటానికి చేతిలో అంగులయిపోయినై. హోదా మాత్రం రక్షించుకోవాలిగా! పైకి దర్జా చెలాయిస్తూనే వుండాలి.

రాత్రి తొమ్మిదిగంటలకి మెంబర్లందరికీ సమావేశం కమ్మని కబురంపించారు. అరవై ఏడుగురికీ, ఇరవైముగ్గురు హాజరయారు. మిగిలినవారు 'బ్రహ్మాండ'మైన పనులమీద గ్రామాంతరం వెళ్ళినట్టూ సాకులు చెప్పించుకున్నారు. హాజరయిన ఇరవై ముగ్గురూ అప్పులు అంగీకరించారు. కొంతే ముట్టిందని కొంద రనలేకపోయారు. ఎదురుగా పరశురాములు నాయుడిమాగ్నటిక్ పెర్సనాలిటీ కూర్చునివుంది. ఆఫీసరుగారు వాయిదాలేదీ జ్ఞాపకంచేసి, సీదాగా అప్పులు వెంటనే చెల్లించాలన్నారు. మెంబర్లు 'గొడ్డూ, గోదా, అనేకం జబ్బులో చచ్చిపోయాయనీ, సరుకు ధరలు మందంగా వున్నాయనీ, ఇప్పట్లో అమ్మితే రైతులు నిష్కారణంగా నష్టపోతారనీ, నీటికాలవ తగువులో కోర్టంట తిరగటానికే ఎంతో డబ్బు వ్యయమైపోయిందనీ, గత ఏడు సంభవించిన అగ్నిప్రమాదానికి కాలిపోయిన ఇళ్ళు ఇంకా సరిగా లేవనెత్తుకోనే లేదనీ మొరపెట్టి మరి ఆరు మాసాలు గడువివ్వించవలసిందని ప్రాధేయపడ్డారు. మూకలో ముత్యం వుంటే, అది పరశురాములునాయుడు వల్లె వేయించిన పాఠమే అని బాహాటంగా చాటి చెప్పేది. వంటలో నిమగ్నురాలయి వుందేమో.

ఆఫీసరుగారు ససేమిరా, వాయిదా ఇవ్వనంటే ఇవ్వనన్నారు. 'మీ కెప్పుడూ ఏవో చిక్కులు తటస్థిస్తూనే వుంటవి. దానికి మేమా పూచీ? వ్యక్తిగతంగా మీరనుభవించవలసిందే. గ్రామంలో ఏ చిక్కులు వచ్చిపడ్డా అప్పులు చెల్లించనే చెల్లించం సుమండీ, అనే మొదట పుచ్చుకున్నారా? ఎందుకీ మాటలు? వచ్చేవారం మళ్ళీ వస్తాను. అప్పటికి పూర్తిగా అప్పులు చెల్లించకపోతే మీమీద చర్య తీసుకోవలసిఉంటుంది.' అని ఖచ్చితంగా హెచ్చరికచేసి చెప్పారు. జాలిగా పరశురాములు నాయుడువంక చూశాయి; సభ్యుల ఆందోళితమైన నేత్రాలు.

కోమటింటికి పొగచుట్టకోసం పోయిన బంట్రోతు ఎప్పటికీ తిరిగి రాకపోతే ఆఫీసరుగారు స్వయంగా తామే పక్క పరుచుకున్నారు. అందుపై మేను వాల్చారు. బయట మంచుపడుతూవుంది. రొజ్జగాలి కొడుతూవుంది. గదికిటికీ రెక్కలుమూసి, తలుపులు బంధించి, ఊలుబనీను తొడుక్కున్నారు. చలి ఆగలేదు. చెవులికి మఫ్లరు చుట్టుకున్నారు. మడత విప్పి శ్రేష్ఠమైన ఉన్ని రగ్గు కప్పుకున్నారు. సిగరెట్టు ముట్టించి, శూన్యంగా గోడలవంక చూస్తున్నారు. పట్నంలో అంత చలిబాధ వున్నట్టు కనిపించదు. పల్లెల్లోనే చలి ఎక్కువ. గాలి కిక్కడ అడ్డంకి ఏదీ? వీళ్ళు చలికి అలవాటు పడిపోయారు. వీళ్ళ శరీరాలు ఈ చలికి వణకనే వణకవు. ఇనుప కవచాలు.

అకస్మాత్తుగా వీధిలో ఏడుపు వినిపిం





బోనోమింట్. మెల్లగా పనిచేసినా. ప్రేగులను మాత్రం పూర్తిగా పరిసుభ్రంచేస్తుంది. ప్రేగుల్లో పట్టుబట్టినట్టుకాని. మరియింకేవిధమైన భాధను కాని కలిగించదు. పెద్దలు. పిన్నలూకూడా బోనోమింట్ చ్యూయింగ్ గమ్ ని నిస్సంకోచంగా వాడవచ్చునని మాసలహా.

౪, ౮, 16, బిళ్లలుగల పేకట్లలో దొరకును.

ఏజెంట్లు:
ఓరియంటల్ మెర్కంటైల్ ఏజన్సీ, 99-A, ఆర్మీనియన్ వీధి, మద్రాసు—1.

చింది. దాపునే మరికొన్ని గొంతుకలు.

'అవుతే ఇంకా పురుడు రానేలేదా?' అడుగుతూ వున్నాయి-ఎవరినో వుద్దేశించి.

'రాలేదు సాయనా! ఇంకా పురుడు రాలేదు. నిచ్చెనెక్కిస్తున్నారు, దించుతున్నారు. అరగంటైంది. తాడు పట్టుకుని వేలాడుతూ వుంది. భగవంతుడి దయ ఎలా వుందో!'

'తొల్చూరు కూడాను!' ఒక ముసలి గొంతుక సౌజన్యంతో అన్నది.

'మంత్రసానిని పిలిపించారా?'

'సాయంత్రంనుండీ ఇంట్లోనే వుంది.'

'సాధ్యం కాలేదా?'

'నానా ప్రయత్నాలూ చేస్తూ వుంది. బిడ్డ బయటపడలేదు. అడ్డంపడ్డదేమో నని అనుమానం. పసిబిడ్డ దక్కకపోతే పోనీ. మా బిడ్డ బతికుంటే అదే మాకు పదివేలు!'

'కాదటమ్మా! చెట్టుంటే పుట్టేడు పూలూ, గరిసెడు కాయలూ. బిడ్డలకేం కొదవ?'

'సీ త్తిరి! ఏటా దెప్పమాటలు? నీ కూతురు బతికుండాలని నువ్వు కోరితే, తన పిల్ల బతికుండాలని నీ కూతురు కోరదూ? అందుకేగదా అన్నిపాట్లూ పడుతున్నది! బిడ్డ పవ్వాలని కోరుకుంటావా? ఇంత కష్టానికీ నువ్వే కారకురాలివి, ముందు నీ మొగమీడ్వాలి, పురిటికి పట్నం తీసుకుపొమ్మంటే నా మాటిన్నావా? తీసుకుపోయావా? గర్రా సేశావు, పిల్లని సంపీశావు. ఎంత సులువుగా పురుడు పోసేద్దురు! మనవణ్ణి సంకనెత్తుకు వొచ్చేదానివి కావా? నీకీ మంతరసాని ముండెక్కడ దొరికింది? దీని కడుపు మండా, దీని సేతిలో సచ్చినోళ్ళే లావు. బతికినోళ్లు సొల్పం. సల్లని సెయ్యి - తల్లిది!!'

ఆ ధోరణి ఇంకెవరిది? ముత్యం దే కాకతప్పదు. ముత్యం కంఠం గంభీరమైంది. మాటాడితే కొండవాగు ప్రవహించినట్లుంటుంది. అనర్గళమైన వాగ్ధార. గలగల మాటలు రాల్తుంటాయి. జామురాత్రి దాటింది. ముత్యానికింకా నిద్దరాలేదా? ఎందరికళ్ళకీ పోతుంది? ఎన్ని విషయాల్లో పొల్లొంటుంది? ఎప్పుడు నిద్రపోతుందో! ఎప్పుడు నిద్రలేస్తుందో!

కుక్కలు భౌభౌమంటున్నాయి. 'కొట్టు! కొట్టు!' అని కేకల్తో దేనినో కొందరు వెంట దరుముతున్నారు. రాళ్ళు రువ్వుతున్న చప్పుళ్ళు, సంగిడీగాడు కానట్టుంది. జంబుక సార్వభౌముడు కోడిపుంజునెత్తుకుపోతున్నట్టున్నాడు. వేటగాళ్ళ కప్కిలు తిరగబడ్డట్టున్నాయి. నిప్పుల

పాతో మరి వెంట దరుమలేక, ఒక చోట ఆగిపోయినట్టున్నారు. పుంజు చేజారిపోయినట్టుంది.

'ఊరకండ్రా! ఊరకండి!! నక్కని సంపి, పుంజుని తెచ్చుకోండి. దిగాలుపడి, సూస్తారేటి మొగోళ్లు.' అంటున్నది ముత్యం.

'నక్కతో ఎవుడు పరిగెడతాడు? పోతే పోనీ పుంజు. తింటే తిన నీ నక్క. దానాకలయినా, కొంతతీరుద్ది.' అభిభాషించాడు. యజమాని అనుకోవచ్చు.

'అబ్బసి! ఏం దయరో, సుబ్బన్నా! నక్కమీద నీకు పుట్టింది. దానికాకలేస్తోందని నీకెంత కనికారం? ఇదే సంగిడీగాడైతే, సిమసిమ కాలి, సద్దువు. నాయుడుతో సెప్పి కుని ఏడుద్దువు. క్రయింరిపోర్టు రాయించి తీరుదువు. దాని అదుష్టంకొద్దీ అది నక్కయిపోయింది. దానిమీద రిపోర్టు రాయించగలర్రా -



# ★ ఆణిముత్యం ★

బడవల్లారా ?' నూటిగా ముత్యం, గుండెలు కెలికింది.

ఆఫీసరుగారు గుడ్డిలాంతరు వెలుగులో రిస్టువాచీ వంక చూశారు. పదకొండు కావస్తున్నది. ఎప్పుడూ ఎనిమిదిగంటల లోపునే నిద్రపోయేవారు. ఈ నాడు ఎంత తిన్నకున్నా నిద్రరాకుండావుంది. కొత్త మనుషులూ, కొత్తజాగా. అంత త్వరగా ఎవరికీ నిద్రపట్టదు. బ్రహ్మప్రయత్నం చేస్తూ వున్నారు. పట్టుమని నిద్రపట్టబోయే వేళకి ఏదో ఒక గంద్రగోళం. ఏడుపో, మొర్రో, కుక్క మొరుగో, నక్క పరుగో, విసిరిన రాళ్ళ దబదబ ధ్వనులో! ఏమైతే నేం, నిద్ర చెరపటానికి ఏమాత్రం చిన్న ధ్వని అయినా చాలు. పిల్లి 'మ్యావ్' మన్నా కళ్లు తెరుచుకుంటాయి. వాటికితోడు విపరీతమైన స్మృతి చిత్రాలు కంటిరెప్పల పల్చటి పొరలపై ఒకటి వెనుక ఒకటి ప్రతిబింబిస్తున్నవి. తాగి మత్తెక్కి, నోటికి వచ్చినట్టు పేల్తూ చీట్లపేకాడుతున్న పరశురాములూ, చెట్టు చివరనుండి పండుటాకులా రాలిపోతున్న పాతేరూ, రజనీమధ్యంలో కోడి నెత్తుకు పోతూవుండగా అడ్డుపడ్డ యజమానిని దుడ్డుగర్రతో బాదేస్తున్న సంగిడీగాడూ, నీటి కాలవ దగ్గిర కత్తులు తీర్చుకుందికి సామూహికంగా కొట్లాడుకుంటూవున్న ఉద్రిక్త గ్రామప్రజా, పెంటకుప్పలో తుళ్లిపడిన నిప్పు రాజి రాజి కొనరాగా దడదడ భీభత్సంగా మండిపోతున్న తాటాకుల యిళ్ల పంక్తులూ, స్ఫురణకి వచ్చి గుండె అలజడి పడ్డది. 'అమ్మయ్య! అమాయికులచోటను కున్నాను. ఇందులో అమాయకు లెవరూ లేరు. ప్రతిమనిషీ స్వార్థమెరిగిన ప్రముఖ రాజకీయవేత్తే. ఎంత దారుణచర్యకైనా ఒడిగట్టగల సాహసి. పీనల్ కోడ్డు శిక్షలన్నిటికీ ఇక్కడ తావుంది. అమాయికులనే


'ఫైలేర్'


బోదజ్వరములను నివారించి వాపులను పోగొట్టును. చాలమంది రోగులు దీనినివాడి మంచి ఫలితములనుపొందిరి. 1½ నెలలకు సరిపడునుందు రు. 3/-

తోలేటి ఆంజనేయులు & సన్,

మారుటేరు, ప. గో. జిల్లా.


బంట్రోతు తలుపులు బడబడగుద్ది, అయ్యగారిని ఎందుకో అలలు, అలలుగా పిలుస్తున్నాడు. ఆందోళనతో ఆఫీసరుగారు పక్క మీదనుండి ఒక్కసారి దూకి, తలుపులు తెరిచి, ఆపాదమస్తకం తీవలా కంపిస్తున్న బంట్రోతుని చూసి, నిర్ఘాంతపడి, 'ఏం జరిగిం దేమిటి?' అని ప్రశ్నించారు.

'నన్ను...నన్ను...వెంట దరుముకొస్తూవుంటే...ముత్యాన్ని పాం కరిచిందండయ్యగారూ! చొంగలు కక్కుకుంటూవుంది. ఇక్కడికే తీసుకొస్తున్నారు.' అని తడబడుతూ చెప్పాడు బంట్రోతు.




ఇంతలో ముత్యాన్ని సంగిడీగాడు బుజాలపై మోసుగొచ్చి పరశురాములు నాయుడు చావడి అరుగుమీద పరుండబెట్టాడు. విషబాధతో వుక్కిరిబిక్కిరై పోతున్నది ముత్యం. వచ్చేప్రాణం, పోయే ప్రాణం. కలికాలూ, మంత్రాలూ, ఆపాము కాటుమీద పని చెయ్యలేదు.

శక్తిహీనమైన చేతులెత్తి ముత్యం ఆఫీసరుగారికి దండం పెట్టి, 'ఆఫీసరు బాబూ! ఆఫీసరు బాబూ! ముత్యానికి మందిప్పించరూ! మందిప్పించరూ!!' అని జాలిగా ప్రాధేయపడింది.

అయ్యగారి మనస్సు చివుక్కుమన్నది. పాలిపోయిన ముఖకవళికతో ముత్యాన్నుద్దేశించి,

'దురదృష్టవంతురాలివి ముత్యం! నేను డాక్టర్ని కాకపోయాను. నాదగ్గిర మందు లేవీ లేవు. నే నీయగలిగినవల్లా...లోన్సు! లోన్సు! అవైనా, రికమెండ్ చేయగల్ను-అంతే! నీ ప్రాణం ఎట్లా రక్షించమంటావు చెప్పూ?' అని తన అశక్తతను తెలియబరుచుకున్నారు.

ముత్యం కళేబరాన్ని సంగిడీగాడు మళ్లీ మోసుకుపోయాడు. వెనక గుసగుసలూ, రుసరుసలూ. అడ్డమైన తిట్లు. మొండిశిఖండి ముత్యాని కవి దహనమంత్రాలు కాబోలు.

కొడవలినుండి తిరిగివచ్చిన తరవాత ఆఫీసులో అయ్యగారు పదేపదే ముత్యంగూర్చి కబుర్లు చెబుతుంటారు. ముత్యం ఆయన గుండెల్లో చిరస్థాయిగా హత్తుకుపోయింది. ఆమెని వారు ఎన్నటికీ మరువలేరు. ఆయన ఆదరాభిమానాల్ని ఆమూలాగ్రం చూరగొన్నది ముత్యం. ఆయనకామె అపరిమిత గర్వకారణం. "ముత్యం ఉత్తపల్లెమూఢ కాదు. మంచి చెడ్డ లెరిగిన మేధావిని. అవినీతి నామె సైరించదు. నిర్మొగమాటంగా ఖండించి తీరుతుంది. తీవ్రమైన పలుకుబడి. ఆ ధాటికి కొమ్ములు తిరిగిన మనుషులు సైతం వెరువవలసిందే. కకావికలై పారవలసిందే. గొణుగుతుంటే చాటున గొణుక్కోవాలి. ముఖాముఖీ వాదించడానికి వీలు వేదీ? మాటలు కటువుగా వున్నా మనసు మెత్తంది. దుస్థితిలో వున్నవారిని చూస్తే, ఆమె సులభంగా ద్రవించిపోతుంది. సాయపడడానికి సర్వదా సిద్ధం. ముత్యంతోపాటు, 'కొడవలి గ్రామా'న్ని పట్టివుంచిన పగ్గాలే రాలిపోయాయి. కొన్నాళ్ళలో గ్రామం తల్లక్రిందు లవుతుందంటే, ఆశ్చర్యంగా వుందా?" ★